# పశ్చిమబెంగాల్ సిఎం మమతాబెనర్జీతో విపక్ష నేత సువేందు అధికారి భేటీ

**కోల్‌కతా, నవంబరు 25:** పశ్చిమబెంగాల్ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో బిజెపి అభ్యర్థి సువేందు అధికారి చేతిలో సిఎం మమతా బెనర్జీ ఓటమిపాలైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత వీరిద్దరూ కలుసుకోలేదు. ఈ రోజు ఊహించని రీతిలో వీరిద్దరూ కలవడం జరిగింది. శాసన సభలో విపక్ష నేతగా ఉన్న సువేందు అధికారి అసెంబ్లీలో ఉన్న సిఎం మమత గదికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మరో ఇద్దరు బిజెపి ఎమ్మెల్యేలు ఉన్నారు. అనంతరం అసెంబ్లీ సెషన్‌లో సువేందుని తన సోదరుడు అని సంబోధిస్తూ మమత మాట్లాడారు. సువేందుని తాను టీకి ఆహ్వానించానని చెప్పారు. మరోవైపు, దీనిపై సువేందు మాట్లాడుతూ, ఇది మర్యాదపూర్వకంగా జరిగిన కలయిక అని అన్నారు. అయితే, తాను టీ తాగలేదని చెప్పారు.



# 2023-24 బడ్జెట్ ప్రతిపాదనలపై కసరత్తు

## రాష్ట్రాలకు వడ్డీరహిత రుణాలపై చర్చ
## అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో భేటీ
## హాజరుకాని తెలంగాణ మంత్రి

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** రానున్న 2023-24 వార్షిక అంచనా బడ్జెట్ ప్రతిపాదనలపై అన్ని రాష్ట్రాల ఆర్థిక శాఖ మంత్రులు, కార్యదర్శులతో కేంద్రం ప్రీ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రీ బడ్జెట్ రూపకల్పనపై వివిధ వర్గాల నుండి అభిప్రాయాలను తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుండి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్ హాజరు కాగా, తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు దీనికి దూరంగా ఉన్నారు.
అయితే ఈ సమావేశానికి ఆర్థిక శాఖ తరపున ఐఏఎస్ అధికారి రోనాల్డ్ రోస్ హాజరైనట్లు సమాచారం. ఈ సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదనలపై రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో నిర్మలాసీతారామన్ చర్చించారు. రాష్ట్రాల ఆర్థిక వ్యవహారాలు, సంస్కరణలు, రాష్ట్రాల మూలధన వ్యయం, మౌలిక సదుపాయల కల్పనకు కేంద్ర నిధుల వినియోగం తదితర అంశాలను గూర్చి సంప్రదింపులు జరిపారు. ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగా మౌలిక సదుపాయల కల్పన కోసం రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చే ఆర్థిక సహాయాన్ని ఎంత మేరకు వినియోగించాలనే దానిపై మంత్రులో చర్చలు జరిపారు. మౌలిక సదుపాయల కల్పన కోసం రాష్ట్రాలకు 50 ఏళ్ల పాటు వడ్డీ రహిత రుణాలను సకూర్చే నిమిత్తం కొత్త ప్రాజెక్టుల లభ్యతపై సలహాలు, చూచనలను స్వీకరించారు. అలాగే రాష్ట్రాలు స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జిఎస్‌డిపి)లో 4 శాతం ఆర్థిక లోటును అనుమతించే విషయంలో 0.5 శాతం విద్యుత్ రంగ సంస్కరణలతో ముడిపడి ఉంటం వంటి వాటిని ప్రస్తావించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు తమ తమ ప్రతిపాదలను కేంద్రం ముందుచారు. కాగా ఇప్పటికే కేంద్రం, తెలంగాణ రాష్ట్రం మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నాయి. దీంతో ఇప్పటికే కేంద్రం నిర్వహిస్తోన్న దాదాపు అన్ని సమావేశాలకూ దూరంగా ఉంటోంది. ప్రస్తుత 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం విధించిన ఆంక్షల కారణంగా 40 వేల కోట్ల రూపాయలకు పైగ గండి పడిందని తెలంగాణ ప్రభుత్వం ఆరోపణలు గుప్పిస్తోంది. ప్రధానంగా ఫిజికల్ రెస్పాన్స్‌బులిటీ బిసినెజ్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌ఆర్‌బిఎం) పరిమితుల్లో కోతలు విధించడాన్ని తప్పుపడుతోంది. ఆర్థిక సంస్థల నుండి రుణాలు రాకుండా కక్ష్యపూరితంగా కేంద్రం అడ్డుకుంటోందని పదేపదే విమర్శలు చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణకు రావాల్సిన 40 వేల కోట్ల రూపాయల నిధులను రాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందని స్వయంగా సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ సమావేశానికి మంత్రి హరీష్‌రావు దూరంగా ఉన్నారు. ఈ విధంగా ప్రీ బడ్జెట్ సమావేశాలకు ఆయన గైర్హాజరు కావడం ఇది రెండోసారి.

# తెలంగాణ రాష్ట్రానికి ఏడు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

## అవార్డులతో జాతీయ స్థాయిలో మరోసారి ముందజ అగ్రభాగాన నిలవడంపై మంత్రి కెటిఆర్ హర్షం



**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పట్టణాల మరోసారి దేశంలో తమ ప్రత్యేకతను చాటాయి. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలకు స్వచ్ఛ్ సర్వేక్షణ్-2022 అవార్డులను దక్కించుకున్నాయి. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రకటించిన అవార్డుల జాబితాలో మరో ఏడు తెలంగాణ పట్టణాలకు చోటు దక్కింది. ఇప్పటికే 75 సంవత్సరాల స్వాతంత్ర్య భారత ఆజాదీ కా అమృత్ ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి స్వచ్ఛ్ సర్వేక్షణ్ విభాగంలో 16 అవార్డులతో పాటు ఐఎస్‌ఎల్ విభాగంలో మరో మూడు అవార్డులను గతంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రధానం చేసింది. ఇప్పుడు కాగజ్‌నగర్, జనగామ, అమన్‌గల్, గుండ్లపోచంపల్లి, కొత్తకోట, వర్ధన్నపేట, గ్రేటర్ వరంగల్ పురపాలికలకు ఫాసెస్ట్ మూవింగ్ సిటీ కేటగిరీలో కేంద్ర ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. మొత్తం 26 అవార్డులను తెలంగాణ రాష్ట్రం సాధించింది.
స్వచ్ఛ్ సర్వేక్షణ్ అవార్డుల కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ జాతీయ స్థాయి శానిటేషన్ సర్వేను జూలై 2021 నుంచి జనవరి 2022 వరకు నిర్వహించింది. పారిశుధ్యం, మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణ, అవగాహనపై దేశ వ్యాప్తంగా ఉన్న 4335 పట్టణ స్థానిక సంస్థల్లో స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే నిర్వహించారు.
అవార్డులకు ఎంపిక చేయబడిన 90శాతం అంశాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిట్టర్ ఫ్రీ వాణిజ్య ప్రాంతాలు, కమ్యునిటీ డెవలప్‌మెంట్, ప్రజల అవగాహన సిటిజన్ ఎంగేజ్‌మెంట్, ఇన్నోవేషన్స్‌లో సర్వే నిర్వహించారు.
తాజాగా మరిన్ని అవార్డులు దక్కడంపై మంత్రి కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచనల్లో నుంచి పురుడుపోసుకున్న పట్టణ ప్రగతి, పల్లె ప్రగతితో తెలంగాణ పల్లెలు, పట్టణాలు రూపురేఖలు మారాయన్నారు. అద్భుతమైన అభివృద్ధిని సాధిస్తున్నాయన్నారు. కెసిఆర్ మార్గదర్శనంలో అటు పల్లెలు, ఇటు పట్టణాలను సమానంగా డెవలప్ చేసేందుకు అమలు చేస్తున్న పరిపాలనా సంస్కరణలు, అనేక అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగానే ప్రస్తుతం జాతీయ స్థాయిలో తెలంగాణాకు అవార్డులు దక్కుతున్నాయన్నారు. తక్కువ మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు ఉన్నప్పటికీ అత్యధిక అవార్డులు దక్కించుకున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. మంత్రి కెటిఆర్, ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక అద్భుత వినూత్న కార్యక్రమాలను యావత్ దేశం ఆదర్శంగా తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అవార్డులు రావడంలో పురపాలక శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు కీలక పాత్ర వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. అవార్డులు సాధించిన పురపాలికల అధికారుల, ప్రజాప్రతినిధులతో సమావేశంలో ఏర్పాటు చేసి అభినందించిన కెటిఆర్, అద్భుతమైన పరిపాలన విధానాలు, పద్ధతులతో జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకొచ్చిన పట్టణాలను రెండు కోట్ల చొప్పున ప్రత్యేక ప్రోత్సాహక నిధులను ప్రకటించారు.

**అవార్డులకు ఎంపికైన పట్టణాలు**

ఆదిబట్ల, బండంగ్‌పేట, భూత్పూర్, చండూరు, చిట్యాల, గజ్వేల్, ఘట్‌కేసర్, హుస్నాబాద్, కొంపల్లి, కోరుట్ల, కొత్తపల్లి, నేరుడు చర్ల, సికింద్రాబాద్, సిరిసిల్లా, తుర్క యాంజాల్, వేములవాడ, వర్ధన్నపేట, జనగామ, కాగజ్‌నగర్, కొత్తకోట, గుండ్లపోచంపల్లి, అమన్‌గల్‌తో పాటు వరంగల్ కార్పోరేషన్‌కు అవార్డులు దక్కాయి.

# రాహుల్‌గాంధీని చంపేస్తానని బెదిరించిన వ్యక్తి అరెస్ట్



**న్యూఢిల్లీ, నవంబరు 25:** కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని చంపేస్తానని బెదిరిస్తూ లేఖ రాసిన వ్యక్తిని మధ్యప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ఇండోర్‌కు చేరుకోగానే బాంబుపేల్చి రాహుల్‌ను హతమారుస్తానంటూ హెచ్చరించిన దయా అలియాస్ ప్యారే అలియాస్ నరేంద్రసింగ్‌ను ఉజ్జయినిలోని నగ్దా ప్రాంతంలో అదుపులోకి తీసుకుని ఇండోర్ పోలీసులకు అప్పగించారు.
నిందితుడి కోసం పోలీసులు 200 సిసి టివి ఫుటేజీలను తనిఖీ చేశారు. అరడజను నగరాల్లోని హోటళ్లు, లాడ్జీలు, రైల్వే స్టేషన్లలో దాడులు చేశారు. నిందితుడు రాయబరేలికి చెందినవాడని, గతంలోనూ లేఖలు, ఫోన్ల ద్వారా చాలామందిని బెదిరించాడని పోలీసులు తెలిపారు. కాగా, ఇండోర్‌లోని ఖల్సా స్టేడియంలో గతంలో జరిగిన కార్యక్రమానికి నిందితుడు హాజరయ్యాడని, ఆ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ పాల్గొన్నారని పోలీసులు తెలిపారు.

# డిసెంబర్ 10,11 తేదీల్లో ఇండియన్ రేసింగ్ లీగ్-2

## ఫిబ్రవరి 11న అసలైన ఫార్ములా-ఇ రేసింగ్ నిర్వహణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 25:** భాగ్యనగరంలో అర్థాంతరంగా నిలిచిపోయిన ఇండియన్ రేసింగ్ లీగ్ యథావిధిగా నిర్వహిస్తామని హెచ్ఎండిఏ అధికారులు చెప్పారు. డిసెంబర్ 10,11 తేదీల్లో ఇండియన్ రేసింగ్ లీగ్-2 ఉంటుందని తెలిపారు. హుస్సేన్‌సాగర్ తీరంలో స్ట్రీట్ సర్క్యూట్‌లోనే ఐఆర్ఎల్ ఫైనల్ రేస్ ఉంటుందన్నారు. ఫిబ్రవరిలో జరిగే ఫార్ములా-ఇ నాటికి పురోగతి చేస్తామని హెచ్ఎండిఏ పేర్కొంది. ఫిబ్రవరి 11న అసలైన ఫార్ములా-ఇ రేసింగ్ నిర్వహిస్తామని తెలిపింది. ఫార్ములా-ఇ కోసం రెడీ చేస్తున్న ట్రాక్‌పైనే ఇండియన్ రేసింగ్ లీగ్ నిర్వహణ ఉంటుందని వెల్లడించింది. స్వల్ప ప్రమాదాల వల్ల ఈనెల 19,20న నిర్వహించిన ఐఆర్ఎల్-1 రేసింగ్ నిలిచిపోయిందని తెలిపారు. ఇటీవల ఫార్ములా-4 రేస్‌తోనే నిర్వాహకులు సరిపెట్టారు. ఇండియన్ రేసింగ్ లీగ్ ప్రాక్టీస్‌తోనే నిర్వహకులు ముగించిన విషయం తెలిసిందే. ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఫార్ములా-ఈ పోటీలకు సన్నాహకంగా భావిస్తున్న జరిగిన ఇండియన్ రేసింగ్ లీగ్... ప్రధాన పోటీలు జరగకుండానే ముగిసింది. సమయాభావం, రేసర్లకు స్వల్ప ప్రమాదాల వల్ల అసలైన రేసును నిర్వాహకులు నిలిపివేశారు. దీంతో అసలైన తుది రేసింగ్ మజాను భాగ్యనగర వాసులు ఆస్వాదించలేకపోయారు. క్వాలిఫయింగ్ రేస్‌లో కొత్త ట్రాక్‌పై పలుమార్లు కార్లు ఢీకొని రేసర్లకు గాయాలయ్యాయి. నాలుగు ఫార్ములా కార్లు ప్రమాదానికి గురయ్యాయి. ఇందులో ఒక రేసర్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. గాయాలకు తోడు చీకటి పడటం, రేసింగ్‌కు రెండురోజులు మాత్రమే అనుమతి ఉండటంతో సోమవారం నిర్వహించే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఇండియన్ రేసింగ్‌లోని మూడు ప్రధాన పోటీలు లేకుండానే సాధారణ పోటీలతోనే నిర్వాహకులు ముగించారు. ఇండియన్ రేసింగ్ లీగ్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన అభిమానులకు నిరాశే ఎదురైంది. ప్రధాన పోటీలు నిర్వహించకుండానే ట్రయల్ రన్‌తో నిర్వాహకులు సరిపెట్టారు. రేసర్లు ట్రాక్‌పై అలవాటు పడేందుకు ఇలా చేశామని తెలిపారు.

# భద్రారెడ్డి, ఐటి అధికారుల పరస్పర ఫిర్యాదులు

## బోయిన్‌పల్లి పిఎస్ నుండి దుండిగల్ పిఎస్‌కు బదలీ

**హైదరాబాద్ (దుండిగల్), నవంబరు 25 ప్రభాతవార్త:** మంత్రి మల్లారెడ్డి ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితుల ఇండ్లపై ఇటీవల ఐటీ అధికారులు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఐటి డిప్యూటీ కమిషనర్ రత్నాకర్, ఐటి అధికారులు తమపై బలవంతంగా నేరాలు మోపుతున్నారని దాడులు జరిగిన రాత్రి మంత్రి చిన్నకుమారుడు మల్లారెడ్డి నారాయణ వైద్యశాల ఎండి.డా.భద్రారెడ్డి బోయిన్‌పల్లి పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఐటి అధికారులు సైతం తమ అధికారి రత్నాకర్‌ను మంత్రి మల్లారెడ్డి నిర్భంధించి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ లాక్కున్నారని, తమ విధులకు అడ్డుపడ్డారని పేర్కొంటూ అదే బోయిన్‌పల్లి పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించిన బోయిన్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సూరారం మల్లారెడ్డి వైద్యశాలలో చోటు చేసుకోవడంతో కేసును బోయిన్‌పల్లి పోలీసులు గురువారం రాత్రి ఆన్‌లైన్‌లో దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈవిషయమై దుండిగల్ సిఐ రమణారెడ్డి వివరణ కోరగా ఇరువురి ఫిర్యాదుల కేసు ఆన్‌లైన్ తమ పిఎస్‌కు వచ్చింది నిజమే అన్నారు. ఇరువురి ఫిర్యాదులపై విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

# రాష్ట్ర కాంగ్రెస్‌లో మరోసారి ప్రక్షాళన

## త్వరలో కొత్త పిసిసి కార్యవర్గం

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ బలోపేతంపై హైకమాండ్ దృష్టిసారించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న పిసిసి కార్యవర్గాన్ని ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ క్రమంలో వర్కింగ్ ప్రసిడెంటున, సీనియర్ వైస్ ప్రసిడెంట్‌లను మార్చే అవకాశం కనిపిస్తుంది. ఈ క్రమంలో గీతారెడ్డి, అంజన్‌కుమార్, అజారుద్దీన్‌లను తొలగించే ఛాన్స్ ఉంది. ఇప్పటికే టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి సైతం పలు సూచనలు చేసినట్లు సమాచారం. అందరిని కలుపుకుని పోతూ పార్టీని బలోపేతం చేయాలని ఆదేశించినట్లు సమాచారం. పదవుల నుంచి తొలగించిన వారికి పొలిటికల్ ఎఫైర్ కమిటీలో సర్దు బాటు చేయాలన్నారు. మరోవైపు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల్ ఇంచార్జ్ మార్పు విషయంపై కూడా చర్చజరుగుతుంది. అందులో భాగంగానే ప్రియాంక గాంధీకి బాధ్యతలు అప్పగించాలని పలువురు నేతలు బలంగా కోరుతున్నారు.
ఇటీవల జరిగిన మునుగోడు ఉప ఎన్నికలలో కనీసం డిపాజిట్ కూడా రాకపోవడంపై అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మరోవైపు కాంగ్రెస్ సీనియర్లు సైతం ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ టీంలో మార్పులు తప్పవన్న వాదన వినిపిస్తుంది. మరోవైపు టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి యేడాదిన్నర కావోస్తున్న నేపథ్యంలో కార్యవర్గంలో మార్పులు జరగలేదు. ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కొత్త అధ్యక్షులుగా నియామకం జరగలేదు. ఇలాంటి పరిస్థితుల్లో తక్షణమే కసరత్తు చేయకపోతే ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లాల ఎంపిక నుంచి రాష్ట్ర స్థాయి ఎంపికలు పూర్తిచేయకపోతే మరోయేడాది సమయం ఉన్న ఎన్నికలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

# వీసా నిబంధనలు పాటించాల్సిందే

## శాన్‌ఫ్రాన్సిస్కో కాన్సుల్ జనరల్ టివి నాగేంద్రప్రసాద్

**వాషింగ్టన్, నవంబరు 25:** అమెరికా వీసాల విషయంలో ఇతర దేశాల మాదిరిగానే భారతీయ పౌరులకు నిబంధనలు ఉన్నాయని శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సుల్ జనరల్ డాక్టర్ టివి నాగేంద్రప్రసాద్ అన్నారు. భారతీయ పౌరుడైనా, విదేశీయుడైనా ఆయా నియమ, నిబంధనలను పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం లాస్‌ఆల్టోస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అమెరికాలోని ప్రవాస భారతీయులు, అగ్రరాజ్యానికి వెళ్లాలనుకునేవారు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై నాగేంద్ర ప్రసాద్ స్పందించారు.
అర్హత ఉన్నవారు ఒసిఐ తీసుకోవాలని ఇతర సేవల కోసం ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్ పొందాలని వివరించారు. కరోనా తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో పిసిఆర్ పరీక్షలను రద్దు చేసినట్లు తెలిపారు. వివిధ కమ్యూనిటీ సంస్థలు, సిఇవోలు, పెట్టుబడిదారులు, విద్యార్థులు, స్టార్టప్ కమ్యూనిటీ, సాంస్కృతిక సంస్థలకు సంబంధించిన సమస్యలపై అనేక విషయాలను నాగేంద్రప్రసాద్ వివరించారు. అమృత్ మహోత్సవాల కాలంలో మీడియా పాత్ర అనే అంశంపైనా మాట్లాడారు. మీడియాలో వచ్చే తప్పుడు కథనాలు ఎదుర్కోవడంపై తన అభిప్రాయాలను ఆయన వెల్లడించారు. అమెరికా నుంచి భారత్‌కు అందుతున్న సహకారం తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ ఒడిశా రాష్ట్రాలకు వస్తున్న పెట్టుబడుల అంశాలను వివరించారు. ఇటీవల కాలంలో భారత్‌కు చెందిన పలువురు కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు మంత్రులు అమెరికాలో నిర్వహించిన పర్యటనలను ఈ సందర్భంగా నాగేంద్రప్రసాద్ ప్రస్తావించారు. ఈ యేడాది జనవరి 1 నుంచి నవంబరు 21 వరకు అందించిన సేవలను ఆయన వివరించారు. పాస్‌పోర్టులు 38,355, ఒసిఐ 90,470, వీసా 13,027, రినన్సియేషన్ 18,314, మిసిలేనియస్ 10,548 అని చెప్పారు. మొత్తం 1,70,813 సేవలను అందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాన్సుల్ డాక్టర్ అకున్ సభర్వాల్, కాన్సులేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయస్థాయి కూచిపూడి పోటీల్లో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థినికి మొదటి బహుమతి

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** విజయమాధవి సేవా సాంస్కృతిక విభాగం వారు హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందు ఈ నెల 6న నిర్వహిచిన జాతీయస్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో తెనాలి రోడ్డులో ఉన్న శ్రీచైతన్య స్కూల్ మంగళగిరి బ్రాంచ్ నందు 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని అయ్యపు శ్రీసౌభాగ్యవల్లి ప్రథమ బహుమతి సాధించింది. శ్రీసౌభాగ్యవల్లి కూచిపూడి నృత్యంలో గత సంవత్సరం నుంచి సాధన మొదలుపెట్టినప్పటికి జాతీయస్థాయి నృత్య పోటీలలో ప్రథమ బహుమతిని పొందడం విశేషమని శ్రీచైతన్య స్కూల్ డైరక్టర్ సీమ తెలిపారు. విద్యార్థినికి విజయవాడ జోన్ ఇజీఎమ్ మురళీకృష్ణ మరియు ఆర్ఐ రామారావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య స్కూల్ డైరక్టర్ సీమ మాట్లాడుతూ శ్రీచైతన్య స్కూల్ - టెక్నో కరిక్యులమ్ నందు విద్యార్థులు చదువుతోగటు అనేక ఇతర అంశాలలో కూడా అత్యుత్తమ ప్రతిభను కనబరచవచ్చని దానికి అయ్యపు శ్రీసౌభాగ్యవల్లి ఉదాహరణ అని చెప్పారు. ఈ సందర్భంగా డైరక్టర్ సీమ విద్యార్థినికి .. ఆమె తల్లిదండ్రులకు మరియు అధ్యాపక బృందానికి అభినందనలు తెలియజేశారు.



# బిసిఐ అనుమతి లేకున్నా వెబ్‌ఆప్షన్లు తీసుకున్న లాసెట్ అధికారులు

## అనుమతులు రాకపోవడంతో సీట్ అలాట్‌మెంట్ చేయని వైనం
## శుక్రవారం రాత్రి వరకు అనుమతులివ్వని బిసిఐ
## పాత కాలేజీలకు అనుమతులు ఇస్తారని
## వెబ్ ఆప్షన్లు తీసుకున్న అధికారులు

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లా కాలేజీలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) శుక్రవారం రాత్రి వరకు అనుమతులు ఇవ్వలేదు. బీసీఐ లా కాలేజీలకు అనుమతులు ఇవ్వకపోయినప్పటికీ ఈ నెల 18 నుంచే లాసెట్-2022లో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన లాసెట్ అడ్మిషన్లకు సంబంధించిన అధికారురు వెబ్ ఆప్షన్లను తీసుకున్నారు. లాసెట్-2022 అడ్మిషన్లకు సంబంధించి అకోట్బర్ 31న షెడ్యూల్ ప్రకటించి.. నవంబర్ 1న నోటిఫికేషన్‌ను జారీ చేశారు . లాసెట్, పీజీలాసెట్-2022 కౌన్సెలింగ్‌ను ఈ నెల 2 నుంచి ప్రారంభించారు. లాసెట్‌లో అర్హత సాదించిన అభ్యర్థులు నవంబర్ 2 నుంచి 12 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. స్పెషల్ కేటగిరికి చెందిన వారికి ఈనెల 14 నుంచి 16 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. వెబ్ ఆప్షన్లను ఈ నెల 18, 19 తేదిల్లో తీసుకొని 21న అర్హులైన అభ్యర్థుల లిస్టును ప్రకటించి.. 22న సీట్ల కేటాయింపు చేయనున్నట్టు నోటిఫికేషన్‌లో ప్రకటించారు. కానీ బీసీఐ రాష్ట్రంలోని లా కాజీలకు 2022-23 విద్యా సంవత్సరంకు సంబంధించి కాలేజీలు చెల్లించాల్సిన ఫీజులను పూర్తి స్థాయిలో చెల్లించకపోవడంతో శుక్రవారం(నవంబర్25) వరకు కాలేజీలకు బీసీఐ అనుమతి ఇవ్వలేదు.
దీంతో ఈ నెల 22న సీట్ల కేటాయింపును ప్రకటించకుండా 23 వరకు వెబ్ ఆప్షన్లను తీసుకున్నారు. అయితే రాష్ట్రంలోని లా కాలేజీలకు ఏ ఏ కాలేజీలకు అనుమతి ఇవ్వనున్నారో.. ఈ రోజు (శనివారం) ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. లాసెట్-2022లో అర్హత సాధించిన అభ్యర్థులు ఇప్పటికే వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ఒకవేళ అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చిన కాలేజీలకు.. కోర్సులకు బీసీఐ అనుమతి ఇవ్వకపోతే.. ఆ విద్యార్థుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.
బీసీఐ నుంచి అనుమతి రాకముందే అంత హడావుడిగా అభ్యర్థుల నుంచి వెబ్ ఆప్షన్లను తీసుకోవల్సిన అవసరం ఎమోచ్చిందని విద్యార్థి సంఘాలు.. అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది 3 సంవత్సరాల లా కోర్సులో 23 కాలేజీల్లో 4049 సీట్లు ఉండగా.. వాటిలో 3597 సీట్లు కన్వీనర్ కోటా సీట్లు ఉన్నాయి. 5 సంవత్సరాల ఇంటిగ్రెటేడ్ లా కోర్సులో 18 కాలేజీల్లో 1818 సీట్లు ఉండగా.. వాటిలో 14,84 కన్వీనర్ కోటా సీట్లు. ఇక పీజీ లాకోర్సుకు సంబంధించి 15 కాలేజీల్లో 758 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 674 సీట్లు కన్వీనర్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ ఏడాది 2022-23 విద్యా సంవత్సరంలో అన్ని కాలేజీలకు అన్ని సీట్లకు బీసీఐ అనుమతి ఇస్తుందా? లేదా? అనేది అనుమతులు వస్తేగాని తెలియదు. అలా కాకుండా అనుమతులు రాకముందే లాసెట్ అడ్మిషన్స్ అధికారులు ఇప్పటికే వెబ్ ఆప్షన్లను తీసుకున్నారు.

# కరెంట్ చార్జీల పెంపు లేనట్టే

## 2023-24లోనూ పాత టారీఫ్
## సబ్సిడీని పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదన
## వచ్చే యేడాది ఎన్నికల నేపథ్యంలో డిస్కంల నిర్ణయం

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణలో వచ్చే 2023-24 ఆర్థిక సంవత్సరంలో కరెంటు చార్జీల్లో పెంపుదల ఉండటం లేదు. విద్యుత్ చార్జీలు పెంచకుండా ప్రస్తుతం అమల్లో ఉన్న టారిఫ్‌నే యధావిధిగా కొనసాగించాలని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆర్థిక నష్టాలోలన కొట్టుమిట్టాడుతున్న డిస్కంలు, విద్యుత్ చార్జీలు పెంచితే వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దాని ప్రభావం ప్రభుత్వంపై తీవ్రంగా చూపుతుందని భావించిన దాన్ని విరమించుకున్నాయి. ఈ నెలాఖరు లోగా 2023-24 సంవత్సరానికి సంబంధించి వార్షిక ఆదాయ అవసరాల నివేదిక, విద్యుత్ చార్జీల ప్రతిపాదనలను డిస్కంలు రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలికి సమర్పించాల్సి ఉంది. దీంతో రాష్ట్రప్రభుత్వమే తమకు సబ్సిడీల కింద లోటును భర్తీ చేయాలని డిస్కంలు ప్రతిపాదించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందుకు అనుగుణంగా డిస్కంలు కసరత్తు చేస్తున్నాయి.
ఇప్పటికే ప్రస్తుత ఆర్థిక సవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నెల నుండి విద్యుత్ చార్జీలు స్వల్పంగా పెంచినట్లు చూపించినా రాష్ట్రంలోని వినియోగదారులపై అదనంగా భారీగా 5,596 కోట్ల రూపాయల మేర భారం మోపాయి. ఇప్పుడు మళ్లీ పెంచితే ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తుందనే ఆలోచనతో పెంపు ప్రతిపాదనలు విరమించుకున్నాయి. మరోపక్క అప్పుల కోసం డిస్కంలు తిప్పలు పడుతున్నాయి. విద్యుత్ నిమిత్తం చత్తీస్‌ఘడ్, సింగరేణి తదితర సంస్థలకు దాదాపు 23 వేల కోట్ల రూపాయలు బకాయిలు పడటంతో వాటి వసూళ్లకు తెలంగాణ డిస్కంలపై అవి పెద్ద ఎత్తున వత్తిడి తెస్తున్నాయి. ఇదే సమయంలో పవర్ ఎక్స్ఛేంజీలో విద్యుత్ కొనుగోలుకు అవసరమైన నిధుల సమకూర్చుకోవడం అత్యవసరం కావడంతో తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలకు ఆర్థిక సమస్యలు పెరుగుతూ ఊపిరితీసుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఈ బకాయిలను తీర్చడం, కరెంటు కొనుగోలు చేందుకు నిధులు సేకరణ తప్పనిసరి కావడంతో డిస్కంలు కేంద్ర విద్యుత్ ఆర్థిక సంస్థల నుండి అప్పులు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి.
మరోపక్క తెలంగాణ డిస్కంలకు రాష్ట్ర ప్రభుత్వ శాఖలు వేల కోట్ల రూపాయలను బకాయిలు పడ్డాయి. డిస్కంల నుండి పెద్ద మొత్తంలో కరెంటు వాడుకుని బిల్లులు కట్టకపోవడంతో దాదాపు 25 వేల కోట్ల రూపాయలకు పైగా అవి మొండి బకాయిలుగా పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విద్యుత్ సబ్సిడీ కింద ఇచ్చే నిధులను పెంచాలని డిస్కంలు కోరేందుకు సిద్ధమవుతున్న వేళ ఇందుకు ఎంత వరకూ సహకరిస్తుందనేది ప్రశ్నార్థకమే అవుతుంది.

